భారమవుతున్న పాలన..

పంచాయతీ కార్యదర్శులకు తప్పని కష్టాలు

- అప్పుల పాలవుతున్న వైనం
- చుట్టపు చూపులా వ్యవహరిస్తున్న స్పెషల్ ఆఫీసర్లు
- అధికారుల ఒత్తిడితో కార్యదర్శుల్లో ఆందోళన



మణుగూరు రూరల్: గ్రామ పంచాయతీల పాలన నేడు ప్రజాప్రతినిధులు లేకనో, అభివృద్ధి నిధులు రాకనో భారంగా సాగుతోంది. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో పంచాయతీల నిర్వహణ కష్టతరమవ్వడమే కాకుండా పంచాయతీ వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారింది. ఫిబ్రవరి నుంచి పంచాయతీలకు ప్రభుత్వం ఉపాధ్యాయులను నుంచి మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులకు నియమించింది. పంచాయతీల నిర్వహణను చూసుకోవాల్సిన స్పెషల్ ఆఫీసర్లు చుట్టపు చూపుల్లా వ్యవహరిస్తూ పాలనను సక్రమంగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పంచాయతీ పాలన, కార్యకలాపాల భారమంతా కార్యదర్శులపైనే పడింది. స్పెషల్ ఆఫీసర్ల పాలన వచ్చిన దగ్గర్నుండి పల్లెల్లో సమస్యలు దర్శనమిస్తున్నాయనే విమర్శలు సర్వత్రా ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ప్రత్యేక అధికారులకు సర్పంచుల నుండి బాధ్యతలు అప్పగించడంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించడం వల్లే పంచాయతీల పాలన గాడి తప్పిందన్న వాదనలున్నాయి. దీనికి తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి పంచాయితీ నిర్వహణ కోసం నిధులు రావాల్సి ఉండగా నేటికీ విడుదల కావడంతో పంచాయతీ కార్యకలాపాల కోసం కార్యదర్శులే వెచ్చించాల్సిన పరిస్థితి వస్తోంది. దీంతో వారికి కష్టాలు తప్పకపోగా పని భారం కూడా అధికమవుతోంది. దీనికి తోడు కార్యదర్శులపై అధికారులు ఒత్తిడి సైతం పెరిగిందనే చెప్పవచ్చు.

తప్పని కష్టాలు..

ఒకవైపు ప్రజా సమస్యలు మరో వైపుపై అధికారుల నుండి ఒత్తిడి కార్యదర్శులను మానసిక సంక్షోభానికి గురి చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు కార్యదర్శులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు లేకపోలేదు. తమకు వచ్చే జీతం పంచాయతీకి వెచ్చించుకుంటూ పోతే తమకు మిగిలేది ఏంటని. వారి కుటుంబాలను ఎలా పోషించుకోవాలంటూ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఉద్యోగం మీదనే ఆధారపడి జీవనం సాగించే కార్యదర్శుల పరిస్థితి దయనీయంగా మారింది. మళ్లీ పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు ఈ విధులు ఎలా నెట్టుకురావాలో అర్థం కాక కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికలపై నిర్ణయం తీసుకోవడంతో పాటు నిధులను తక్షణమే విడుదల చేయాలని కార్యదర్శులతో పాటు ప్రజలు కోరుతున్నారు.

అప్పుల పాలవుతున్న వైనం..

సర్పంచుల కాలం ముగిసిన నాటి నుంచి కార్యదర్శులపై ఆర్థిక భారం పడుతోంది. ఏ చిన్న సమావేశం నిర్వహించాలన్నా ఏర్పాట్లు చేయడానికి ఖర్చులు కార్యదర్శులే భరించాల్సి వస్తుంది. పంచాయతీ గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికి సుమారు రూ.700 వరకు నిధులు విడుదల చేసేది. ఆయా నిధులు కూడా అసెంబ్లీ ఎన్నికల ముందు నుండి నిలిచిపోయాయి. పంచాయతీల్లో ఇంటి పన్నులు, గృహనిర్మాణ ఫీజులు, వ్యాపార, వాణిజ్య వంటి వాటిపై ఆదాయం సమకూరుతుంది. చిన్న పంచాయతీలకైతే ఇలాంటి ఆదాయం కూడా ఉండదు. కేవలం ప్రభుత్వం నుంచి వచ్చే నిధులే ఆధారం. ట్రాక్టర్‌కు డీజిల్, బోర్ రిపేర్లు, కరెంట్ బిల్లులు, లైట్ల కొనుగోలు, డంపింగ్ యార్డ్ నిర్వహణ, సిబ్బందికి జీతాలు వంటి వాటికి ఆర్థిక వనరుల లేక కార్యదర్శులు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారాయి. కార్యక్రమాల నిర్వహణకు ఇప్పటికే కార్యదర్శులు అప్పులపాలై ఆర్థిక భారాన్ని మోయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యేక అధికారులు పంచాయతీలపై కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.

క్లుప్తంగా

నేడు వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

దుమ్ముగూడెం: కలెక్టర్ జితేష్ పాటిల్ బుధవారం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారని తహసీల్దార్ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెక్టర్ మండల పర్యటన నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ఉదయం 8.30 గంటలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కలెక్టర్‌కు వినతి..


వినతిపత్రం అందజేస్తున్న యూత్ సభ్యులు

బూర్గంపాడు: మండల కేంద్రంలో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని బూర్గంపాడుకు చెందిన ఏబీఆర్ యూత్ సభ్యులు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కోరారు. మంగళవారం ఏబీఆర్ యూత్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమ్యూనిటీ హాల్ అవసరాన్ని కలెక్టర్‌కు వివరించి వినతిపత్రం అందజేశారు. యూత్ ప్రతినిధులు మోహన్‌రావు, పుల్లయ్య, రవిప్రసాద్, రవికుమార్, దుర్గాప్రసాద్, పండు, రాజేష్, మల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు


పనులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

భద్రాచలంఅర్బన్: పట్టణంలో ఉన్న రెండు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహణ పనులను చేపట్టారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో విద్యుత్ సరఫరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా పనులు చేపట్టామని విద్యుత్ శాఖ ఏఈ రాజారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన

చర్ల రూరల్: మండలంలోని సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని బోటుగూడెం, కుదునూరు, జంగాలపల్లి, పెదమిడిసిలేరు, దేవరపల్లి గ్రామాలలో మంగళవారం అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి


మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి: ఈనెల 20న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై మండలంలోని హెచ్‌ఎం, టీచర్స్, ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బందికి మండల వైద్యాధికారిణి ప్రియాంక అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రగుంట పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 1 నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వయస్సుల వారీగా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట జెడ్పీ హెచ్‌ఎం ఆనంద్, టీచర్స్, ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే తునికాకు బోనస్ చెల్లించాలి


మాట్లాడుతున్న గౌరి నాగేశ్వరరావు

ములకలపల్లి: తునికాకు బోనస్ వెంటనే చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరి నాగేశ్వరరావు, తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములకలపల్లిలో మంగళవారం జరిగిన మండలకమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2012 నుండి పెండింగ్‌లో ఉన్న బోనస్‌ను వెంటనే కార్మికుల ఖాతలో జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి మాలోతు రావూజా, తేజావత్ జగ్గు, వెంకటేశ్వర్లు, కీసరి నాగరాజు, లక్ష్మి, సీతారాములు పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

గుండాల: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలని, నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారస్తులపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలని అఖిల భారత రైతు స్కూల్ సంఘం నాయకులు కోరం సీతారాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఇమ్మానియేల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వెంటనే రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఎలాంటి ఆంక్షలు లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం మండలాధ్యక్షులు బచ్చల సారన్న, గడ్డం లాలయ్య, పెండ కట్ల పెంటన్న, బానోతు లాలు, ఇసం సుధాకర్, చింత కోటేష్, కల్తి ప్రమోద్, పాడుగు జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

తులసమ్మ చెరువుకు మరమ్మతు చేయించాలి


చెరువును పరిశీలిస్తున్న రైతులు

దుమ్ముగూడెం : మండలంలోని నారాయణరావుపేట పంచాయతీ పరిధిలో ఉన్న తులసమ్మ చెరువుకు మరమ్మతులు చేయించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి సాయన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చెరువును గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2013 సంవత్సరానికి ముందు నిర్మించిన ఈ చెరువు కింద 300 ఎకరాలకు పైగా వరి పంట సాగయ్యేదని, కాగా చెరువు కట్ట మెయిన్ గేటు దొంగలు ఎత్తుకుపోయారన్నారు. తక్షణమే అధికారులు చెరువును మరమ్మతు చేసి కాలువ పూడికతీసి పొలాలకు నీరు అందించాలని కోరారు. ముత్తయ్య, ఈశ్వర్, సాగర్, ప్రసాద్ పాల్గొన్నారు.

సరుకులు వితరణ

మణుగూరు రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో పలు కుటుంబాలకు సఖి జాతీయ మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం బియ్యం, సరుకులను అందజేశారు. మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ స్వరూప, జిల్లా ఉపాధ్యక్షురాలు మంగ, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ఉచితంగా వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: స్థానిక కెమిలాయిడ్స్ ఫ్యాక్టరీ సిబ్బందికి మంగళవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏపీలోని ఏలూరులోగల ఆశ్రమం హాస్పిటల్ వైద్యులు రాఘవరామ్, రామ్‌నాథ్, అఖిల్, విద్యాసాగర్, పూర్ణసాయి, ఆనంద్ ఆధ్వర్యంలో పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. మేనేజర్ సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, శ్రీనివాసరాజు, రామానుజం, పద్మజ ఉన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ


బూర్గంపాడు: ఎస్సీ బాలుర వసతి గృహంలో..

బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ వసతి గృహాలలో మంగళవారం దోమల నివారణ మందులు పిచికారీ చేశారు. మండలకేంద్రం బూర్గంపాడులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ, కేజీబీవీ, టీఎస్ఆర్‌జేసీ విద్యార్థుల వసతి గృహాలలో దోమలమందును పిచికారీ చేశారు. మండల వైద్యాధికారి లక్ష్మీ సాహితి, హెల్త్ సబ్ యూనిట్ ఆఫీసర్ జీతు, సీహెచ్‌ఓ సోమ్లా, హెచ్‌ఎస్ రమణమూర్తి పర్యవేక్షించారు.

మణుగూరు రూరల్: సీజనల్ వ్యాధుల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని ఏజెహెచ్ఎస్, మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలల్లో, హాస్టళ్లలో మంగళవారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు, వైద్య సిబ్బంది రాంప్రసాద్, ఉమేష్ పాల్గొన్నారు.

దోసిళ్లపల్లిలో..

చర్ల రూరల్: మండలంలోని కొయ్యూరు పీహెచ్‌సీ పరిధిలోని దోసిళ్లపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది దోమలమందు పిచికారీ చేశారు. ప్రతీ ఇంట్లో దోమలమందు పిచికారీ చేయడంతో పాటు నీటి నిల్వలు లేకుండా శుభ్రపరచుకోవాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ సర్వే నిర్వహించారు. వైద్యాధికారి శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్లు నరసింహారావు, ధర్మారావు, ఏఎన్‌యం స్వరూపారాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


చర్ల రూరల్: దోసిళ్లపల్లిలో..


మణుగూరు రూరల్: పిచికారీ చేస్తున్న సిబ్బంది

పాయంకు పరామర్శ


పాయంను పరామర్శిస్తున్న నాయకులు

మణుగూరు టౌన్: పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తల్లి పాయం రాములమ్మ మరణించగా, విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు మంగళవారం ఎమ్మెల్యేను పరామర్శించారు. సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోల్లోజు అయోధ్య, పాల్వంచ డీఎస్పీ సతీష్, సీఐ వినయ్ కుమార్ అశ్వాపురం, పినపాక, మణుగూరు, ఎంపీడీఓలు, ఎంపీవోలు, మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిర్రా రవి, సభ్యులు, పంచాయతీ రాజ్ అధికారులు, వ్యాపారి దోసపాటి పిచ్చేశ్వరరావు సమితిసింగారంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి పరామర్శించారు.

అశ్వాపురం: మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే పాయంను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్, పాటి మన్మథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి ఎమ్మెల్యే జారే..


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

దమ్మపేట: హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మిత్రుడిని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం పరామర్శించారు. మండలంలోని బాలరాజుగూడెం గ్రామానికి చెందిన కల్లూరి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే బాల్యమిత్రుడు కాగా, ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో హృదయ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే అతన్ని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

న్యాయవాదుల సంతాపం


సంతాపం తెలుపుతున్న న్యాయవాదులు

మణుగూరు రూరల్ : అశ్వాపురం మండలానికి చెందిన న్యాయవాది నిమ్మల సోమిరెడ్డి ఇటీవలే మరణించగా మంగళవారం మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై సంతాపం తెలిపారు. మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిర్ర రవికుమార్, సహాయ కార్యదర్శి సర్వేశ్వరరావు, న్యాయవాదులు పానుగోటి కిషన్‌రావు, కందిమళ్ల నర్సింహరావు, శ్రీనివాస్, అన్వేష్ సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

అన్ని వేళలా అండగా ఉంటా..

- ఎంపీ బలరామ్‌నాయక్


ఎంపీ బలరామ్‌నాయక్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బూర్గంపాడు: పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటానని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరామ్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం బూర్గంపాడులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించిన పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీని పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భజన సతీష్, డేగల రాజుయాదవ్, భజన ప్రసాద్, గుండె వెంకన్న పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి 200 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చెందినా కావాలిస్న వైద్యులు అందుబాటులో లేకపోవడం, వైద్య పరికరాలు, సరిపడా సిబ్బంది లేకపోవడంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం నాదెళ్ల లీలావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని దీనిలో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చొరవ తీసుకుని ముందస్తుగా చర్యల్లో భాగంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. భద్రాచలం పట్టణంలో పూర్తయిన డబుల్ బెడ్ రూం గృహాలను అర్హులైన పేదలకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శివర్గ సభ్యులు పి.సంతోష్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు సీతాలక్ష్మి, ఎస్.నాగరాజు, జీవనజ్యోతి, లక్ష్మీకాంత్, ఎస్.భూపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఒక వైపు వెలుగులు.. మరో వైపు చీకటి


పగలే వెలుగుతున్న వీధి దీపం

చర్ల: మండలంలోని కుదునూరులో వారం రోజులుగా కొన్ని ప్రాంతాలలో పగలు రాత్రి అనీ తేడా లేకుండా వీధీ దీపాలు వెలుగుతూ ఉంటే మరి కొన్ని ప్రాంతాలల్లో పూర్తిగా అంధకారం నెలకొంది. అసలే వార్షాకాలం సీజన్ కావడంతో విషపురుగుల సంచారం అధికంగా ఉండే అవకాశం ఉండడంతో రాత్రి వీదుల్లో అంధకారం నెలకొని ఉండడంతో జనం భయాందోళనలు చెందుతున్నారు. ఇటీవల భారీగా వీచిన గాలి దుమారానికి విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడడంతో పాటు పలు చోట్ల విద్యుత్ తీగలు కలిసిపోవడం వంటివి జరిగినట్లు స్థానికులు తెలియజేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ రహదారి ప్రాంతంలో అంధకారం నెలకొనగా లోపలి వీధుల్లో మాత్రం అన్ని వేళలా దీపాలు వెలుగుతున్నాయి. గ్రామంలో నెలకొన్న సమస్యలను తీర్చాలను స్థానికులు కోరుతున్నారు.

ఎఫ్‌పీఓలు ప్రయోజనకరం



శిక్షణ కార్యక్రమంలో ఎఫ్‌పీఓ డైరెక్టర్లు

దమ్మపేట: ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లు, రైతులకు ప్రయోజనకరంగా ఉండి అండగా ఉంటాయని శిక్షకుడు నవీన్ అన్నారు. మంగళవారం మండలంలోని మల్లారం రైతువేదికలో ఎఫ్‌పీఓ డైరెక్టర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పండించిన పంటలకు మార్కెట్‌లో ఒడిదుడుకులు, డిమాండ్‌కు అనుగుణంగా ఎఫ్‌పీఓలు రైతులకు ఆసరాగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పుల్లయ్య, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, చెలికాని సూరిబాబు, కొయ్యల అచ్యుతరావు, మద్దినేని వెంకట్, తుమ్మా రాంబాబు, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, కొత్తా మహేష్ పాల్గొన్నారు.

గాలిదుమారంతో నిలిచిన విద్యుత్ సరఫరా

చర్ల: మండలంలో మంగళవారం సాయంత్రం వీచిన గాలి దుమారానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలి దుమారానికి తోడు వర్షం కూడా కురివడంతో పలు చోట్ల విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గతంలో చర్ల, దుమ్ముగూడెం మండలాలకు ఆలుబాక, ఎటపాక సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్‌సరఫరా ఉండేది. ఒక వైపు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే మరొక వైపు నుంచి విద్యుత్ సరఫరాను తీసుకొని విద్యుత్ పునరుద్ధరించేవారు. కానీ ప్రస్తుతం చర్ల మండలానికి ఆలుబాక వైపు నుంచి మాత్రమే విద్యుత్‌సరఫరా కొనసాగుతుండగా గత 15 రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో తీవ్రంగా అంతరాయాలు కలుగుతున్నాయి. మంగళవారం కూడా గాలిదుమారం రావడంతో విద్యుత్ లైన్‌లో అంతరాయం కలగడంతో విద్యుత్‌సరఫరా నిలిచిపోగా చర్ల మండలంలో అంధకారం నెలకొంది. అంతరాయాలను నియంత్రించేందుకు శాఖాధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బదిలీలు చేపట్టాలి

చంద్రుగొండ: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనావత్ శంకర్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఇస్లావత్ వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, నిర్లిప్తత కారణంగానే ప్రక్రియ మార్గదర్శకాల విడుదలలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుర్తింపులేని పాఠశాలను మూసివేయాలి

అశ్వాపురం: మండల కేంద్రంలో ఓ పాఠశాల రెండు సంవత్సరాలుగా గుర్తింపు లేకుండా పాఠశాల నడుపుతున్నారని సదరు పాఠశాలను మూసివేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర యువసేన అధ్యక్షుడు గొల్లపల్లి నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ... ఎంఈఓ సంప్రదించగా పాఠశాలకు గుర్తింపు లేదని తెలిపారని, తక్షణమే పాఠశాలను మూసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు పెంచాలి


బూర్గంపాడు: వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

బూర్గంపాడు: అంగన్‌వాడీ టీచర్ల, సహాయకుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్‌అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెడ్డి అరుణ డిమాండ్ చేశారు. మోరంపల్లి బంజరలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టి సీడీపీఓ ప్రమీలకు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మల్లిఖార్జున్, నాయకులు హంసవేణి, రత్నకుమారి, మంగతాయారు, విజయలక్ష్మీ, సుశీల, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు నారం సునిత, పసుపులేటి శివలక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గరికె నాగమణి, సున్నం మణి, రమ్య, రాజేశ్వరి, నాగలక్ష్మి, బీబీనాంచారి పాల్గొన్నారు.

చంద్రుగొండ: ప్రతీ నెలా వేతనాలు సకాలంలో ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్ల ఆధ్వర్యంలో మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. భూక్యా భారతి, ఇనుపనూరి రమాదేవి, సుభాషిణి, గోపమ్మ, శోభారాణి, అనిత, వరలక్ష్మి, జానకి పాల్గొన్నారు.


ములకలపల్లిలో..


చంద్రుగొండలో..